క్లుప్తంగా

సమస్యాత్మక కేంద్రాలపై నివేదిక ఇవ్వండి



పెడన: పెడన నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు 216 ఉన్నాయని, వీటిల్లో సమస్యాత్మకమైనవి, అత్యంత సమస్యాత్మకమైనవి ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి నివేదిక ఇవ్వాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం పెడన తహసీల్దార్ కార్యాలయంలో పెడన సర్కిల్‌లోని పెడన, బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను మండలాలకు చెందిన పోలీస్ అధికారులు, పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ హాబీబ్‌బాషాతో కలిసి పోలింగ్ కేంద్రాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సమస్యాత్మకమైనవి, అత్యంత సమస్యాత్మకమైనవి ఎన్ని ఉన్నాయి, ఆయా కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు ఉన్న వసతులను నివేదికలో నమోదు చేయాలన్నారు. సీసీ కెమేరాల ఏర్పాటు వంటి వాటిని కూడా పరిశీలనలోకి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పెడన తహసీల్దార్ పి. మధుసూదనరావు, ఎస్ఐలు రవిచంద్రకుమార్, గణేష్‌కుమార్, పైడిబాబు, శేషుకుమార్ పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మోపిదేవి: జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరం మోపిదేవి ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహిస్తామని మోపిదేవి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ లక్ష్మీనాథ్ గురువారం తెలిపారు. రెండో విడత జగనన్న సురక్షా శిబిరాన్ని ఉదయం 9 గంటలకు స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభిస్తారని చెప్పారు. వైద్య బృందంతో పాటు మహిళలకు ప్రత్యేక డాక్టర్స్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు.

30 మద్యం సీసాలు స్వాధీనం



కోడూరు: బెల్టు షాపుల్లో విక్రయిస్తున్న 30 మద్యం సీసాలను కోడూరు పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజేంద్రప్రసాద్ సిబ్బందితో కలిసి బెల్టు షాపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లోని మద్యం షాపు పక్కనే కోడూరుకు చెందిన బచ్చు గణేష్ అనధికారికంగా బెల్టు షాపును నిర్వహిస్తున్నట్లు గుర్తించామని ఎస్ఐ తెలిపారు. బెల్టు షాపులో ఉన్న 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

సిమెంట్ బల్లల వితరణ

అవనిగడ్డ: అవనిగడ్డకు చెందిన రాజనాల వీర బాబు రూ.40 వేల విలువగల సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ వైద్యశాల, నేరెళ్లపాలెం బస్టాండ్, సీతాయిలంక సెంటర్, కొత్తపేట సెంటర్, లంకమ్మ మాన్యం రామాలయం వద్ద వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, బచ్చు వెంకటనాథ్, చెన్నగిరి సత్యనారాయణ, యాసం చిట్టిబాబు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత

అవనిగడ్డ: దివ్యాంగులకు బస్‌పాస్‌లను స్థానిక ఆర్టీసీ కార్యాలయం వద్ద శనివారం అందిస్తామని డిపో మేనేజర్ హనుమంతరావు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాస్‌లు అందిస్తారన్నారు. దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు తీసుకుని రావాలని డిపో మేనేజర్ సూచించారు.

మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పఠాన్



చల్లపల్లి: వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ విభాగం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శిగా చల్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పఠాన్ కరిముల్లా ఖాన్ నియమితులయ్యారు. గురువారం జిల్లా పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు అయూబ్ ఖాన్ జారీ చేసిన నియామక ఉత్తర్వులను అవనిగడ్డలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతులమీదుగా పఠాన్ అందుకున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేస్తానని పఠాన్ తెలిపారు. పఠాన్‌కు పదవి రావడంపై పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

జగనన్న పాలనను కోరుకుంటున్న ప్రజలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- మండలంలో కొత్తగా 129 పింఛన్లు మంజూరు
- నాగాయలంకలో పింఛన్ల పంపిణీ



నాగాయలంకలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, ప్రజాప్రతినిధులు

నాగాయలంక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితోపాటు పారదర్శక పాలన అందిస్తున్నారని, అందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలు మళ్లీ మళ్లీ కోరుకుంటున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నాగాయలంక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగింది. లబ్ధిదారులకు ఎమ్మెల్యే పెన్షన్లను పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా పెన్షన్లను రూ.3 వేలకు పెంచి అవ్వాతాతల హృదయాల్లో నిలిచారని చెప్పారు. నాగాయలంక మండలంలో 8,143మంది ఫించన్‌దారులకు రూ.2,36,86,500 అందించామని, వీరిలో 129 మందికి కొత్తగా మంజూరయ్యాయని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరుగుతోందన్నారు. వేదిక వద్దకు రాలేని స్థితిలో ఉన్న దివ్యాంగురాలు ఉప్పాల నాగతిరుమల (భావదేవరపల్లి సచివాలయం) వద్దకు ఎమ్మెల్యే సింహాద్రి వేదిక నుంచి లేచి వెళ్లి పెన్షన్ నగదు అందజేశారు. ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, తహసీల్దార్ జె.విమలకుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనతో మారిన పేదల జీవనం..

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్పీ కార్యాలయ ప్రాంగణంలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ టీవీఎం రామదాసు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పెన్షన్ నగదును రూ.3 వేలకు పెంచుతామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారని చెప్పారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్ కోసం టీడీపీ నేతల చుట్టూ తిరిగాల్సి ఉండేదని, జగన్ పాలనలో అర్హత ఉంటే వలంటీరే ఇంటికి వచ్చి పెన్షన్ మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు బురద చల్లడం పరిపాటిగా మారిపోయిందని, వీటిని ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. ఈ నెల మండలంలోని 11 సచివాలయాలకు సంబంధించి 124 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని, వీరికి కూడా ఈ నెలలో పెన్షన్ నగదును వలంటీర్లు అందిస్తారని చెప్పారు. సచివాలయ సిబ్బంది పనితీరును అభినందించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, సర్పంచి వెన్నా షైనీ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు పరిశె మాధవరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



కోడూరులో లబ్ధిదారులకు పెన్షన్ నగదును అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

వృద్ధులకు భరోసా..

అవనిగడ్డ: పింఛన్ల పెంపుతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వృద్ధులకు భరోసా కల్పించారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పింఛన్లను పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో గూడు కట్టుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, తహసీల్దార్ రామకృష్ణ, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పలు విభాగాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ల అందజేత

మచిలీపట్నంటౌన్: నగరంలోని పదో డివిజన్‌కు చెందిన ఇరువురు వైఎస్సార్ పింఛను కానుక లబ్ధిదారులు అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి ఆయా క్లస్టర్ల వలంటీర్లు ఆస్పత్రికి వెళ్లి పింఛన్లను అందజేశారు. డివిజన్‌లో నివాసం ఉంటున్న దేవరకొండ చంద్రశేఖరశాస్త్రి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ రెండు నెలలుగా ఆస్పత్రిలో ఉండి చికిత్స పొందుతున్నారు. ఆయనకు పింఛను సొమ్మును వలంటీర్ షేక్ పర్వీన్ ఆస్పత్రికి వెళ్లి అందజేసింది. పింఛనుదారుడు వాడసరి సంజీవరావు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నెల రోజులుగా ఆస్పత్రిలో ఉండి చికిత్స పొందుతున్నాడు. ఈయనకు వలంటీర్ ఆకుమర్తి ప్రియాంక ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్ము అందజేసింది. వలంటీర్లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



చంద్రశేఖరశాస్త్రికి పింఛను అందజేస్తున్న వలంటీర్ షేక్ పర్వీన్

వైఎస్సార్ బీమా అందజేత



బంటుమిల్లి: బంటుమిల్లి కేవీఆర్ కాలనీ (బీసీ కాలనీ)కి చెందిన పెయింటర్ పంచకర్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణ సాయంగా రూ. 10 వేలను మృతుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎంపీటీసీ ఎండీ కమాల్‌బాషా అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

- కోనేరుసెంటర్: బుద్దాలపాలెం పీఏసీఎస్ సభ్యుడు, గ్రామానికి చెందిన కొక్కు రామకృష్ణ ఇటీవల మృతిచెందాడు. మట్టి ఖర్చుల కింద రూ. 10వేలను రామకృష్ణ కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ సీఈఓ ఎస్‌వీ మోహన్‌రావు పాల్గొన్నారు.
- కోడూరు: లింగారెడ్డిపాలెం పీఏసీఎస్ సభ్యులు మందపాకల గ్రామానికి చెందిన జన్ను నాగమల్లేశ్వరరావు, చినగుడుమోటు గ్రామానికి చెందిన అబ్దుల్ మజీద్ ఇటీవల మృతిచెందారు. వీరి కుటుంబ సభ్యులు ఒక్కొక్కరికి సంఘం తరుపున రూ.10వేల నగదును అందించారు. సంఘ చైర్‌పర్సన్ చిట్టిప్రోలు బ్రహ్మారావు, సీఈఓ సీహెచ్‌సుబ్బారావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో లెక్కిస్తామని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించే హుండీ లెక్కింపులో ఆసక్తిగల భక్తులు డ్రెస్‌కోడ్‌లో పాల్గొనవచ్చునని చెప్పారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

ఎమ్మెల్యే పేర్ని నాని



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

మచిలీపట్నం టౌన్: స్థానిక భాస్కరపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన అదనపు 8 ఎం.వి.ఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలోని 15 డివిజన్ల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే కాకుండా గృహ అవసరాలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉంటుందని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. భాస్కరపురంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ నూతనంగా ఏర్పాటు చేసిన 8 ఎం.వి. ఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మచిలీపట్నం నగర పాలక సంస్థ డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి తో కలిసి ఎమ్మెల్యే పేర్ని నాని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో విద్యుత్ వాడకం గణనీయంగా పెరగడంతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని భాస్కరపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 8 ఎం.వి. ఏ ట్రాన్స్‌ఫార్మర్ రూ. 1.30 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశామని తెలిపారు. దీనివల్ల ఈ ప్రాంతంలోని 15 డివిజన్ల ప్రజలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. గతంలో విద్యుత్‌ను 10 శాతం అదనంగా వాడే వారని, కానీ గత వేసవిలో విద్యుత్ వాడకం 40 శాతానికి పెరిగిందన్నారు.

ప్రజల అవసరాలతో పాటు సౌకర్యాలు పెరిగాయని, దీంతో విద్యుత్ వాడకం గతంతో సరిపోల్చితే ప్రస్తుతం పెరిగిందన్నారు. ప్రజావసరాల దృష్ట్యా ఈ సబ్‌స్టేషన్ లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ నెలకొల్పి మళ్లీ మరో పదేళ్ల పాటు ఇబ్బందులు రాకుండా చేశామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 11, 12, 15 డివిజన్ల ఇన్‌చార్జీలు గూడవల్లి నాగరాజు, బందెల థామస్ నోబుల్, మహమ్మద్ రఫీ, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, కాగిత జవహర్ లాల్, రాసంశెట్టి వాణిశ్రీ , పర్ణం సతీష్, విద్యుత్ శాఖ మచిలీపట్నం డివిజన్ ఈఈ ఎం. భాస్కరరావు, ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ రవి కిషోర్, ఏడీఈ రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా పైడమ్మ జాతర ఉత్సవాలు



శిడిబండి ముందు డప్పు కళాకారుల నృత్యాలు

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారంతో పదో రోజుకు చేరాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడులు తీర్చుకునేందుకు శిడిబండ్లకు బొమ్మలు కట్టి సుందరంగా అలంకరించి డప్పు మేళాలతో ఊరేగింపుగా నృత్యాలు చేసుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. కొందరు నేరుగా ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

కనుల పండువగా తెప్పోత్సవం..

గురువారం రాత్రి పైడమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి హంస వాహనంపై పైడమ్మ చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఆలయ ఈఓ మోహనరావు, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ వారితో పాటు దేవదాయ శాఖాధికారులు, సిబ్బంది, పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హాబీబ్‌బాషా, ఎస్ఐ రవీంద్రకుమార్ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది తెప్పోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేశారు.



పైడమ్మ చెరువులో అమ్మవారి తెప్పోత్సవం

రసవత్తరంగా క్రికెట్ పోటీలు



నాగాయలంకలో క్రీడాకారులకు సూచనలిస్తున్న అధికారులు

నాగాయలంక: ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో భాగంగా మండలంలోని నాలుగు జోన్లకు సంబంధించిన గ్రామ స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో రోజు హోరాహోరీగా జరిగాయి. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం క్రికెట్ పోటీలను ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ ప్రారంభించారు. మండలంలోని మర్రిపాలెం, రేమాలవారిపాలెం, నాగాయలంక ఒకటి, రెండు సచివాలయాల పరిధిలోని గ్రామీణ క్రీడాకారులు క్రికెట్ పోటీలలో పాల్గొన్నారు. 26 పురుషుల జట్లు, 12 మహిళా జట్లు క్రికెట్‌లో తలపడుతున్నాయి. వ్యాయామ ఉపాధ్యాయులు గాజుల లక్ష్మీప్రసాద్, టీఎస్ రత్నకుమారి, కోసూరు పూర్ణచంద్రరావు, సీహెచ్ సుబ్బారావు, ఎం.శ్రీనివాస్, వి.సందీప్ పోటీలు నిర్వహిస్తున్నారు.

- మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పలు జట్ల యువకులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ ఆటల పోటీలు నిర్వహించగా, చివరిగా క్రికెట్ పోటీలు మోపిదేవి జెడ్పీ పాఠశాలలో జరుతున్నాయని వివరించారు. 5, 6 తేదీలలో కూడా క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. రామకృష్ణ తెలిపారు. పీఈటీలు కె. సత్యనారాయణ, ఎ. శ్రీహరి, ఎ. తాతాజీరావు, వైటీ గాబ్రియేల్ పాల్గొన్నారు.
- మచిలీపట్నంటౌన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నగరంలోని నోబుల్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నగరంలోని పలు డివిజన్లకు చెందిన 15 జట్లు పోటీపడ్డాయి. శుక్రవారం 24 జట్లు హాజరై పోటీ పడనున్నాయి. ఈ పోటీలను చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నె శేషారావు, చిత్తజల్లు రాజు పర్యవేక్షించారు.
- చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు అన్నారు. గురువారం స్థానిక ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు నిర్వహించారు. గ్రామంలోని మూడు సచివాలయాల నుంచి ఆరు జట్లు విచ్చేయగా పోటీలు నిర్వహించారు. ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, శానిటరీ అధికారి కలతోటి సుధాకర్, గ్రామ సచివాలయ కార్యదర్శులు తిరువీధుల రాజశేఖర్, మెరకనపల్లి నాగ వెంకట తిరుమలేష్, పూషడపు విష్ణు, పసుపులేటి భవానీశంకర్, పీఈటీలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆస్పత్రి ఉద్యోగి అప్పారావు మృతి



మచిలీపట్నం టౌన్: ఈడేపల్లికి చెందిన సర్వజన ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ కోన అప్పారావు (58) గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అప్పారావు మృతి వార్త తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం అప్పారావు అంతిమయాత్రలో పాల్గొని పాడెను మోశారు. అప్పారావు మృతదేహాన్ని కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, బూరగ రామారావు, సర్వజన ఆస్పత్రికి చెందిన పలువురు వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. అప్పారావు ఇటీవల కొద్ది నెలల క్రితం మచిలీపట్నం నుంచి విజయవాడ సర్వజన ఆస్పత్రికి బదిలీ అయ్యారు. అప్పారావు మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కీలక నాయకుడిగా పనిచేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక అనఘాష్టమి వ్రతం



ప్రధానపీఠం వద్ద పూజలు చేస్తున్న దంపతులు. పాల్గొన్న విద్యార్థులు, మహిళలు

నాగాయలంక: మండల దత్త భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో గురువారం సామూహిక ప్రధాన అనఘాష్టమి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. దత్త పురోహితుడు శనగపల్లి వెంకటరావు బ్రహ్మత్వంలో ప్రధాన పీఠం వద్ద జరిగిన కలశ పూజలో నాగాయలంక ఇరిగేషన్ ఏఈఈ పొన్నూరు రవితేజ, పుష్పనాగజ్యోతి దంపతులు పీటలపై కూర్చున్నారు. స్థానిక విద్యాభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, పరిసర గ్రామాలకు చెందిన మహిళలు 108 మంది సామూహికంగా వ్రతం ఆచరించారు. తొలుత దత్త పాదుకలతో విద్యార్థులు, దత్త భక్తులు నాగాయలంక ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కృష్ణానది జలాలతో సంప్రోక్షణ చేశారు. అనంతరం ప్రధాన వేదికపై పాదుకలను ఉంచి పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు సౌజన్యంతో జరిగిన కార్యక్రమంలో దత్త బృందం ప్రతినిధులు చుండూరు సత్యనారాయణ, చిట్టా రామలింగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు చిట్టా శివనాగేశ్వరరావు, మునగాల మోహన్ రావు, తాడికొండ సత్యనారాయణ, పాలెం సర్పంచ్ అంబటి శ్యాంప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి చంటి, దత్త భక్తులు పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్' చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



హనుమాన్‌జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయతలపెట్టిన 'హిట్ అండ్ రన్' చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆల్ ఆంధ్రా లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబురావు, షేక్ మసూద్ ఆలీ డిమాండ్ చేశారు. స్థానిక విజయవాడ రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయం వద్ద లారీ డ్రైవర్లు, క్లీనర్లు గురువారం శాంతియుతంగా ఆందోళన నిర్వహించారు. 'హిట్ అండ్ రన్' చట్టంతో లారీ డ్రైవర్ల జీవితాలు అంధకారంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ అసోసియేషన్ తరుపున వినతి పత్రాన్ని పంపుతున్నట్లు చెప్పారు.

డీఎస్సీ అభ్యర్థుల ధర్నా

అవనిగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ అభ్యర్థులు వంతెన సెంటర్‌లో గురువారం ధర్నా, మానవహారం చేశారు. నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్ధిఖ్ మాట్లాడుతూ వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



కేకు కట్ చేస్తున్న ఎంఈఓ రవికుమార్

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో గురువారం బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా వరల్డ్ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి కె.రవికుమార్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చూపులేనివారు విద్యను అభ్యసించేందుకు బ్రెయిలీ కనిపెట్టిన లిపి అంధుల పాలిట వరంగా మారిందన్నారు. ఈ లిపి వల్ల అంధులు తమంతట చదవడం, రాయడం చేయగలరని పేర్కొన్నారు. బ్రెయిలీ సృష్టించిన లిపి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. ముఖ్యంగా భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందిస్తున్న సదుపాయలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీపీఆర్టీయూ సేవాదళ్ అధ్యక్షుడు డి.శ్రీను నేతృత్వంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సిల్వర్‌జూబ్లీ పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈ నెల 9వ తేదీన అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ (విశాఖపట్నం) అసిస్టెంట్ డైరెక్టర్ డీవీఎస్ఆర్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సమావేశపు హాల్‌లో సదస్సు ప్రారంభమవుతుందని చెప్పారు. స్వయం ఉపాధి ప్రాతిపదికన కుటుంబ ఆధారిత వ్యాపారాల్లో నిమగ్నమైన చేతులు, పనిముట్లతో చేసే వృత్తిదారుల కోసం అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ పథకం రిజిస్ట్రేషన్ చేస్తారని, సంబంధిత కుల వృత్తిదారులు కార్యక్రమంలో పాల్గొని ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా వచ్చే లబ్ధిని పొందాలన్నారు. ఇతర వివరాలకు సెల్: 94926 89462 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బందరులో మినీ జాబ్ మేళా

మచిలీపట్నం టౌన్: స్థానిక బైపాస్ రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. 18 మంది హాజరుకాగా జియో టెలికం కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముగ్గురిని ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ కొత్త గుండు రమేష్, ఎన్సీఎస్ యంగ్ ప్రొఫెషనల్ జయరాజు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

8 వేల ఎకరాల్లో దాళ్వా సాగు



పి.నైనవరం(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలంలో ఈ ఏడాది దాళ్వా పంటలు 8 వేల ఎకరాల్లో సాగు చేశారని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలిపారు. పి.నైనవరం గ్రామంలో దాళ్వావరి నాట్లను గురవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. దాళ్వా వరి సాగు చేసేందుకు రైతాంగం ఆసక్తి చూపుతున్నారన్నారు. వరితో పాటు తెల్లజొన్న, అక్కడక్కడా మొక్కజొన్న, కూరగాయలను సాగు చేస్తున్నారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఎలాంటి నీటి కొరత ఉండదని చెప్పారు.